




పిడుగురాళ్లలో నిలిచిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

నీటి పథకాలపై నీలినీడలు

- ఐదేళ్లు నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- పట్టణాల్లో నిలిచిపోయిన తాగునీటి పథకాలు
- కూటమి ప్రభుత్వం స్పందిస్తేనే ప్రజల దాహార్తి తీరేది

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

నిధులు నిలిపివేయడం.. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. జిల్లాలో తాగునీటి పథకాలపై నీలినీడలు అలుముకున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వైసీపీ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అమృత్ పథకంలో చిలకలూరిపేట, ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో వినుకొండ, పిడుగు రాళ్ళ, మాచర్ల మున్సిపాల్టీలలో తాగునీటి పథకాల విస్తరణను గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మున్సిపాల్టీల్లో రానున్న 25 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి అందుకు అనుగుణంగా నీటి పథకాల ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ నీటి పథకాలకు ఏఐఐబీ రుణం 70 శాతం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే ఆయా పనులు అటకెక్కాయి. బ్యాంకు నుంచి విడుదలైన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ధనం ఇవ్వకపోగా బ్యాంకు విడుదల చేసిన నిధులను వినియోగించుకుంది. ఐదేళ్లుగా నీటి పథకాల పనులు పూర్తి కాకపోవడంతో మున్సిపల్ కేంద్రాల్లో ప్రజలు నీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులను మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు నీటి పథకాల పనులను నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో వారికి బిల్లుల బకాయిలు చెల్లిస్తేనే పనులు ముందుకు సాగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి పథకాల పనులు ప్రారంభమవుతాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఏఐఐబీ నిధులతో మున్సిపాల్టీలలో తాగునీటి సమస్యలకు నాటి టీడీపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర ప్రణాళికను రూపొందించగా వైసీపీ దానిని విస్మరించింది. ఈ పరి స్థితుల్లో నీటి నిల్వ చెరువుల ఆధునికీకరణ, పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధి ప్లాంట్ల విస్తరణ తదితర పనులు ఐదేళ్లుగా ముందుకు సాగ లేదు. దీంతో వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మున్సిపాల్టీలలో ప్రజలు తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆయా మున్సిపాల్టీలో తాగునీటి సరఫరా కూడా అరకొరగానే జరుగుతోంది.



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

అరకొరగానే పనులు..

వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మున్సిపాల్టీలలో సుమారు రూ.295 కోట్లతో పనులు చేపట్టారు. మాచర్లలో రూ.55 కోట్లతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పూర్తయ్యాయి. పిడుగురాళ్లలో రూ.102 కోట్లతో, వినుకొండలో రూ.138 కోట్లతో పనులు చేపట్టగా 20శాతం కూడా పూర్తి కాలేదు. మూడు మున్సిపాల్టీలలో పైపులైన్ల నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. చిలకలూరి పేటలో అమృత్ పథకం కింద తాగునీటి పథకం విస్తరణ టీడీపీ హయాంలో చేపట్టగా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 42 కిలో మీటర్లు పొడవున పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టి అప్పట్లోనే 10 కిలోమీటర్లు పూర్తి చేశారు. మిగిలిన 32 కిలో మీటర్లు పైపులైన్ పనులకు నిధుల కొరత నెల కొంది. పైపులైన్ నిర్మాణానికి రూ 80 కోట్లు వ్యయం అవుతుంది. మున్సిపాల్టీ వాటా కింద రూ.15 కోట్లు బ్యాంకు నుంచి రుణం తీసుకుంది. ప్రభుత్వం రూ.63 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఈ నిధులు విడుదల చేస్తామని అప్పట్లో చిలకలూరిపేట పర్యటనలో ముఖ్యమంత్రిగా జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాలేదు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చేపట్టిన నీటి పథకాలపై కూటమి ప్రభుత్వం స్పందిం చాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా ఎన్నికల ముందు తాగునీటి పథకాలను పూర్తి చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఈ ప్రకారం పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందిం చేలా సత్వరం చర్యలు తీసుకోవాల్సి ఉంది. చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్లలో నీటి పథకాలకు నిధులు విడుదల చేసిన నిర్మాణాలు పూర్తి చేయాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఆయా పట్ట ణాల ప్రజలు కోరుతున్నారు.



పంచాయతీలకు.. పండగే

- కేంద్రం నుంచి భారీగా నిధులు
- 1172 పంచాయతీలకు రూ.68.69 కోట్లు
- జడ్పీ, మండల పరిషత్‌లకు రూ.12.75 కోట్లు
- రెండు రోజుల్లో ఆయా ఖాతాలకు నిధుల జమ
- నిధులపై మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- శానిటేషన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలకు మోక్షం
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి బలైన పంచాయతీ వ్యవస్థ



పంచాయతీల బలోపేతం తోనే.. స్థానిక స్వపరిపాలన. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠతే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. సచివాలయ వ్యవస్థతో పంచాయతీల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇక నిధులను ఇవ్వక పోగా కేంద్ర ప్రభు త్వం జారీ చేసే ఆర్థిక సంఘం నిధులను కూడా జగన్ ప్రభుత్వం దారి మళ్లించుకుని దుర్వినియోగం చేసింది. ఒకవైపు హక్కులు, విధులు, నిధులు కోల్పోయి పంచాయ తీ పాలకవర్గాలు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించు కోలేదు. నిధులు లేక కనీస పనులు కూడా చేయలేక పంచాయతీలు కునా రిల్లిపోయాయి. ఉనికే ప్రశ్నార్థకంగా మారిన పంచాయతీ రాజ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వంతో మళ్లీ పూర్వ వైభవం వస్తోంది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వంలో దారి మళ్లిన ఆర్థిక సంఘం నిధులను తాజాగా పంచాయతీల ఖాతాలకు కూటమి ప్రభుత్వం జమ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పైగా ఐదేళ్ల వైసీపీ పాలనలో ఊసేలేకుండా పోయిన గ్రామసభల నిర్వహణకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తంమీద మసకబారిన గ్రామ పంచాయతీల ప్రతిష్ఠ కూటమి ప్రభుత్వంతో తిరిగి ప్రకాశించనున్నది.

గుంటూరు, నరసరావుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పూర్తిగా గాడి తప్పిన పంచాయతీరాజ్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది. నిధుల విడుదల, గ్రామసభల నిర్వహణతో పంచాయతీలకు మంచి రోజులు రానున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను భారీ మొత్తంలో రాబట్టుకోవడంతో పాటు, వాటిని స్థానిక సంస్థల అభివృద్ధి పనులకే వినియోగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పంచాయతీరాజ్ వ్యవస్థకు ప్రాణం వచ్చినట్లయింది. కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకే నేరుగా వచ్చేలా చర్యలు తీసుకుంది. వైసీపీ పాలనలో గడిచిన ఐదేళ్లుగా పంచాయతీల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా లేదు. ఆఖరికి స్వాతంత్య్ర, గణతంత్ర వేడుకలు చేయాలన్నా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఎవరో ఒకరు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిరర్థకంగా తయారయాయి. అలాంటి దశలో నేడు గ్రామ పంచాయతీలకు భారీ మొత్తంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంతో గ్రామాల్లో కొత్త కళ సంతరించుకోనుంది. గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించి పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేయడంతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలన్నీ మూతపడిపో యాయి. యం త్రాలన్నీ తుప్పు పట్టి పాడైపోయాయి. తాజాగా నిధులు రావడంతో తిరిగి ఆ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. దీంతో పాటు గ్రామాల్లో మురుగునీటి వ్యవస్థ సమర్థవంతంగా నిర్వహిం చేందుకు డ్రెయినేజీల నిర్మాణానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించుకోగలిగితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 2వేల కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించుకునే వీలు ఉంటుంది. స్థానిక సంస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూట మి ప్రభుత్వం వాటి బలోపేతానికి చర్యలు తీసుకుంటోంది. నిధులను దారి మళ్లించగా ఆందోళనలు చేసిన పంచాయతీ పాలకవర్గాలపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ నిధుల విడుదలతో పాటు స్థానిక సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టడంపై వివిధ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

దారి మళ్లించిన వైసీపీ.. జమ చేసిన కూటమి

పంచాయతీలకు మూడు రకాలుగా ఆదాయం సమకూరుతుంది. అయితే ఆర్థిక సంఘం నిధులే కీలకం. గ్రామాల్లో తక్కువ జనాభా ఉండడం, జీవన ప్రమాణాలు స్వల్పంగా ఉండడంతో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం నామమాత్రమే. చిన్న పంచాయతీలైతే కనీసం 10 వేల రూపాయలు కూడా ఆదాయం రాదు. రెండో ఆదాయ వనరు నరేగా. వాటిని గ్రామీణ ఉపాధి హామీ పనులకు మాత్రమే వినియోగించు కోవాలి. దీంతో ఆ నిధుల వినియోగానికి పరిమితులు ఉన్నాయి. గత ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని సచివాలయాలు, విలేజ్ హెల్త్ సెంటర్లు, లైబ్రరీల నిర్మాణానికి వినియోగించింది. దీంతో ఆర్థిక సంఘం నిధులే పంచాయతీలకు దిక్కయ్యాయి. కేంద్రం ప్రభుత్వం 2024 మార్చి 28న 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధుల ను విడుదల చేసింది. ఈ నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి స్థానిక సంస్థలకు మొండి చేయి చూపింది. అడ్డదారు ల్లో ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలోకి మళ్లించుకుంది. గ్రామీణాభివృద్ధికి తప్ప మరే విధంగానూ వినియోగించ రాదని తెలిసినా, ఆ నిధులను దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం లక్ష్య పెట్టలేదు. నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నా.. సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా జగన్ ప్రభుత్వానికి పట్టలేదు. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన వెంటనే ఒక్కో పంచాయతీలో రూ.3 నుంచి 5 లక్షల వరకు కరెంటు బిల్లులు, రాష్ట్ర ఖజానాకు జమయ్యే ఇతర చెల్లింపులకు వినియోగించింది. దీంతో పంచాయతీ నిధులు మొత్తం రాష్ట్ర ఖజానాకు జమయ్యేవి. చివరికి 2024 ఎన్నికలకు ముందు మార్చిలో విడుదలైన ఆర్థిక సంఘం నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించింది. గ్రామ సభలు పెడితే ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయని వాటిని కూడా పక్కన పెట్టేశారు. ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. పంచాయతీరాజ్ వ్యవస్థకు తిరిగి ప్రాణం పోస్తూ స్థానిక స్వపరిపాలనకు రూపకల్పనకు నడుంకట్టింది. ఎన్నికల ముందు ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేసి వాటిని బలోపేతం చేస్తామని కూటమి నేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకారం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే నిధులను పంచాయతీలకు కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, మంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించడంపైనా ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. గ్రామ సభల్లోనే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రచించి, ముందుకు సాగేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

వ్యయంపై మార్గదర్శకాలు..

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రకారం స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబం. ధించిన పనులను చేపట్టాలని ఆదేశించింది. జలవనరులను పెంపొందించుకునేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగు నీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరు గుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వాహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించింది. ఆర్థిక ఇబ్బందు లతో కునారిల్లుతున్న పంచాయతీలు ఈ నిధులతో కొంత మేర నిలదొక్కుకునే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం విష జ్వరాలు, అడుగంటిన పారిశుధ్యం, దోమలు, అపరిశుభ్రత తదితర సమస్యలతో అల్లాడుతున్న గ్రామాల్లో ఆయా సమస్యలు తీరే అవకాశం ఏర్పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులలో 50 శాతం నిధులు పారిశుధ్యంపైనే ఖర్చు చేయనున్నారు. ప్రధానంగా తడిచెత్త, పొడిచెత్త కార్యక్రమ నిర్వహణతో పాటు, చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.



నిధుల విడుదల ఇలా..

కేంద్రం నుంచి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థల ఖాతాలకు రెండు రోజుల్లో జమ కానున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 1172 పంచాయతీలు, గుంటూరు జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు కలిపి మొత్తం రూ.81.44 కోట్లు విడుదలయ్యాయి. జనాభా ప్రాతి పదికన పంచాయతీలకు నిధులను విడుదల చేశారు. పల్నాడు జిల్లాలో 519 పంచాయతీలకు రూ.29.50 కోట్లు, బాపట్ల జిల్లాలో 426 పంచాయతీలకు రూ.22.89 కోట్లు, గుంటూరు జిల్లాలోని 227 పంచాయతీలకు రూ.16.30 కోట్లు విడుదలయ్యాయి. ఇక గుంటూరు జిల్లా పరిషత్‌కు రూ.5.16 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.7.59 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

నిధుల విడుదలపై హర్షం

ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంపై ఆయా పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో ఇదే నిధుల కోసం రోడ్డెకి ఆందోళనలు చేస్తే అప్పటి ప్రభుత్వం తమను నిర్ధాక్షణ్యంగా అరెస్టు చేసిందని, కొంతమందిపై కేసులు కూడా పెట్టిందని పలువురు తెలిపారు. చివరకు పంచాయతీల్లో చిన్నచిన్న పనులకు నగదు లేక భిక్షాటన చేసినా నాటి పాలకుల్లో చలనం లేకుండా పోయిందన్నారు. కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే నిధులు విడుదల చేసి కునారిల్లిపోతోన్న పంచాయతీలను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నారని హర్షం వక్తం చేశారు. నిధుల విడుదలపై అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో కూడా పంచాయతీల నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. నిధుల విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు జాస్తి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టాలెక్కుతున్న.. రైల్వే ప్రాజెక్టులు

- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు
- టీడీపీ ప్రభుత్వం రాకతోనే మళ్లీ పనులు మొదలు
- 2014-19లో నడికుడి - శ్రీకాళహస్తి మార్గం పరుగులు
- అప్పట్లోనే గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రారంభం
- నేడు గుంటూరు - బీబీనగర్ రెండో మార్గం భూసేకరణ చకచకా
- త్వరలోనే అమరావతి కొత్త రైలుమార్గం నిర్మాణానికి అంకురార్పణ



గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కాలన్నా.. పనులు పరుగులు తీయాలన్నా.. టీడీపీ ప్రభుత్వం ఉండాల్సిందేనా. అంటే జరుగుతున్న పరిణామాలు అవునంటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నడికుడి - శ్రీకాళహస్తి మార్గం, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు గుంటూరు - బీబీనగర్ రెండో మార్గం భూసేకరణ, అమరావతి కొత్త రైలుమార్గం పనులు పట్టాలెక్కాయి. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ హయాంలో రైల్వే ప్రాజెక్టులు ఊసే లేకుండా పోయింది. దీనిని బట్టి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగాలంటే అధికారంలో తెలుగుదేశం పార్టీ ఉండాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇతర అనుమతులు, రైలు మార్గాల నిర్మాణానికి వినియోగించే సామగ్రిని సమకూర్చడం వంటివి టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని ఇటీవల ప్రారంభమైన పనులు చేస్తే ఎవ్వరికైనా అర్థం అవుతుంది. మారుమూల ప్రాంతాలకు రైలుమార్గాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్న సిద్ధాంతాన్ని టీడీపీ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుంది. ఈ కారణంగానే కొత్త రైల్వే ప్రాజెక్టు ఏది వచ్చినా అది సాధ్యమైనంత త్వరగా ముందడుగు వేసేందుకు అను వైన వాతావరణాన్ని కల్పిస్తున్నది. 2014-19 మధ్య కేంద్రంలో ఎన్‌డీఏ, ఇక్కడ టీడీపీ ప్రభుత్వాలు ఉన్నాయి. అప్పట్లో గుంటూరు-గుంతకల్లు రెండో రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి న్యూ రైల్వే లేన్ ప్రాజెక్టులు జిల్లాకు మంజూరయ్యాయి. దాంతో వాటికి అవసరమైన భూములను సేకరించి ఇచ్చే బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగిం చింది. దాంతో పిడుగురాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, శావల్యాపురం, వినుకొండ తదితర మండలాల్లో భూములను సేకరించడంతో నాలుగేళ్ల క్రితమే 40 కిలోమీటర్లకు పైగా రైలు మార్గం నిర్మాణాన్ని పూర్తి చేసింది. ప్రస్తుతం గూడ్స్‌రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. త్వర లోనే ప్యాసింజర్ రైళ్లను పట్టాలెక్కించేందుకు ప్రయత్నాలు జరుగు తున్నాయి. మరోవైపు గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుకి కూడా ప్రాధాన్యం ఇచ్చి భూములను సేకరించింది ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు నల్లమడ అటవీప్రాంతం వరకు రెండో మార్గం నిర్మాణం పూర్తి అయి రైళ్ల సమయపాలన గణనీయంగా పెరిగింది. కాగా వైసీపీ ప్రభు త్వ పాలనలో ఏ ఒక్క రైల్వే ప్రాజెక్టుకు ముందుకు సాగలేదు. కనీసం ఆర్‌వోబీ, ఆర్‌యూబీలకు కూడా మ్యాచింగ్ గ్రాంటుని విడుదల చేయలేదు.

ప్రస్తుతం చకచకా పనులు

టీడీపీ ప్రభుత్వం పరిపాలన ప్రారంభిస్తూనే గుంటూరు - బీబీనగర్ రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే గుంటూరు జిల్లాలో 47 ఎకరాల భూమి సేకరణకు కాంపిటెంట్ అథారిటీ అయిన గుంటూరు ఆర్‌డీవో నోటిఫికేషన్ ఇచ్చారు. అలానే ఎక్కువ విస్తీర్ణంలో భూమిని సేకరించాల్సిన పల్నాడు జిల్లా పైనా దృష్టి కేంద్రీకరించింది. ఈ రైలు మార్గంలో ఎక్కువగా పల్నాడు జిల్లాలోని వివిధ మండలాల మీదగా సాగనున్నది. దీంతో సత్తెనపల్లి మం డలంలోని ధూళిపాళ్లలో 12.36, కంకరణాలపల్లెలో 7.96, సత్తెనపల్లిలో 17.15, భీమవరంలో 5.13, అబ్బూరులో 2.08, గుడిపూడిలో 4.22 ఎకరాల భూమిని సేకరించేందుకు సత్తెనపల్లి ఆర్‌డీవో ద్వారా భూసేకరణ ప్రక్రియని ప్రారంభించింది. బెల్లంకొండ మండలంలో 11.73, పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు గ్రామంలో 11.18, లింగంగుంట్లలో 12.54, చినమక్కెనలో 0.68, రాజుపాలెం మండలంలోని చౌటుపాపాయపాలెంలో 13.69, రెడ్డిగూడెంలో 13.2, కుబాత్‌పురంలో 4.83, రాజుపాలెంలో 10.25 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ విధంగా 127.01 ఎకరాలను ఈ ఏడాది ఆఖరులోపే సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నది. మరోవైపు పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లోనూ భూములు సేకరించాల్సి ఉండటంతో అక్కడి ఆర్‌డీవో కూడా దీనిపై దృష్టి సారించారు.

- అమరావతి రాజధానికి నూతన రైలుమార్గం నిర్మాణానికి సం బంధించి ఇప్పటికే డీపీఆర్‌ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రాజెక్టు కోసం గుంటూరు జిల్లాలో 407.73 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నది. రైల్వే శాఖ ఎప్పుడు కోరితే అప్పుడు భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు సంసిద్ధతని వ్యక్తపరిచింది. ఈ నేపథ్యంలో రైల్వే ప్రాజెక్టులు జిల్లాలో ముందడుగు వేయాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే సాధ్యపడుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది.

ఉమ్మడిగా.. రెవెన్యూ బదిలీలు

- ప్రత్యేక కమిటీని నియమించిన ప్రభుత్వం
- నోడల్ అథారిటీగా గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో ఉద్యోగుల బదిలీలు ప్రస్తుత జిల్లాల్లోనే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన కూడా జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 19 నుంచి 31 మధ్య బదిలీల ప్రక్రియని పూర్తి చేయాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, తత్సమాన స్థాయి అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులు, వీఆర్‌వో గ్రేడ్-1, 2 ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీకి గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నోడల్ అథారిటీగా వ్యవహరిస్తారు. పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా, మెంబర్ కన్వీనర్‌గా గుంటూరు డీఆర్‌వో ఉంటారు. ఈ కమిటీ భేటీ అయి ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. విభజన జరిగిన జిల్లాలో జరిగే తహసీల్దార్, వీఆర్‌వో గ్రేడ్-1 ఉద్యోగుల బదిలీలను కలెక్టర్, జేసీ, డీఆర్‌వో అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ చేపడుతున్నది. ఇక డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుల బదిలీలు జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, కలెక్టరేట్ ఏవో కలిసి సమావేశమై చర్చించి నిర్ణయిస్తారు. తహసీల్దార్లు ఎవరైతే అంతర్ జిల్లాల బదిలీలు కోరుకుంటున్నారో వారి వివరాలను సీసీఎల్ఏకి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.



తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.



సిద్ధు కోసం శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

దిక్సూచి

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. ● Must have passed Class 12 with a minimum of 60% marks. ● The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

● Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

SBIF Asha

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each

- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date: 01-10-2024 ***Short Url:*** www.b4s.in/aj/SBIFS7

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LAnmSIT లో చదవండి.



అవార్డులను చూపుతున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అధ్యాపకులు

వీవీఐటీకి బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు

పెదకాకాని, ఆగస్టు 21: జేఎన్టీయూకే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ వర్సిటీ నిర్వహించిన వేడుకలలో భాగంగా అనుబంధ కళాశాలలకు అందించిన పురస్కారాలలో వీవీఐటీ కళాశాలకు బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ అవార్డు లభించిందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. దీంతోపాటు సీనియర్ ప్రిన్సిపాల్, ఉత్తమ అధ్యాపకులుగా అకడమిక్ డీన్ డాక్టర్ కే.గిరిబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టీ.శ్రీనివాసరావులు పురస్కారాలు అందుకున్నారని ఆయన తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జేఎన్టీయూకే 17వ ఆవిర్భావ దినోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కే.రామ్మోహనరావు, జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చేతులమీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు గిరిబాబు, శ్రీనివాసరావు ఈ పురస్కారాలను అందుకున్నారన్నారు. అనంతరం పురస్కారాలను పొందిన అధ్యాపకులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ ఎస్.బదరీ ప్రసాద్, వైస్‌చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్‌లు అభినందించారు.

ఇన్‌చార్జి వీసీతో స్కిల్ సిబ్బంది భేటీ

పెదకాకాని, ఆగస్టు 21: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావుతో యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, సిబ్బంది బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై జరుగుతున్న కార్యక్రమాలు గురించి యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్‌కే మహమ్మద్ రఫీ, స్కిల్ కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్.సాయి కుమార్, వార్డెన్ ఎన్. కృపానందంలు వివరించారు. ఇందులో ముఖ్యంగా కాస్కేడింగ్ స్కిల్, ఎకో సిస్టం, స్కిల్ హబ్స్, స్కిల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న స్కిల్ సైన్సెస్ కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఇన్‌చార్జి వీసీ సానుకూలంగా స్పందించి యూనివర్సిటీ కళాశాలల్లో విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలకు తగిన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

23న జాబ్‌మేళా

గుంటూరు (విద్య), ఆగస్టు 21: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా పరిధిలోని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రఘు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పది నుంచి డిగ్రీ, పీజీ పూర్తయి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు గుంటూరు గుజ్జనగుండ్లలోని కావూరి కాంప్లెక్స్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాల కోసం 9866822697లో సంప్రదించాలని సూచించారు.

మాకు ప్రాణ రక్షణ కల్పించండి

- మంత్రి లోకేశ్ వద్ద వైసీపీ బాధితుల కన్నీటిపర్యంతం
- ఆందోళన వద్దు.. అండగా ఉంటానని మంత్రి హామీ
- 29వ రోజు ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరణ



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్కౌట్ సిబ్బంది

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21 : 'వైసీపీ రౌడీలు గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జాచేశారు. ఇంటిని ఆక్రమించారు. చంపుతామని బెదిరిస్తున్నారు...' అంటూ వైసీపీ బాధితులు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ ఎదుట కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఉండవల్లి నివాసంలో 29వరోజు బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ ప్రజల నుంచి వినుతులు స్వీకరించారు.

వైసీపీ రౌడీలు తన గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారని గుంటూరు తెనాలికి చెందిన విశ్రాంత రైల్వే డ్రైవరు పిల్లి అబ్రహం, కుమార్తె పిల్లి సుధారాణి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత, దుగ్గిరాల జడ్పీటీసీ దాసరి వీరయ్య, అతని అనుచరులైన రౌడీషీటర్, తెనాలి వన్ టౌన్ వైసీపీ కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, గడ్డేటి బాలయ్య, రౌడీషీటర్ మహంకాళి, పిల్లి తిరుపతయ్య, మహేష్‌లు కలిసి వేధిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. వృద్ధుడినైన తనపై దాడిచేసి చంపుతామని బెదిరిస్తు న్నారని, ఇంటిని ధ్వంసం చేసి బయటకు గెంటేశారని, వాపోయారు. దిక్కుతోచని స్థితిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలే దన్నారు. పలు భూకబ్జాలు, హత్యలు సెటిల్‌మెంట్లు, కేసుల్లో ముద్దా యిలైన వైసీపీ రౌడీల బారినుంచి ప్రాణ రక్షణ కల్పించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

మంగళగిరి నియోజకవర్గంలో సమస్యలిలా ...

కోవిడ్ సమయంలో భర్త చనిపోయాడని, కూలిపనులు చేసుకుని జీవనం సాగించే తనకు కుటుంబ పోషణ భారంగా మారిందని బీమా అందించడంతోపాటు ఆర్థిక సాయంచేసి ఆదుకోవాలని పెద వడ్లపూడికి చెందిన బీ.భారతి కోరారు. వైసీపీ ప్రభుత్వం తొలగించిన వృద్ధాప్య పెన్షన్‌ను పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన నండూరి మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ పెన్షన్ కోసం గత ప్రభుత్వంలో పలుమార్లు దరఖాస్తు చేసిన ఫలితం లేదని, తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని యర్రబాలెం చెందిన షేక్ కరిమున్ కోరారు. ఇంటి స్థలం కేటాయించాలని మంగళగిరి కుప్పరావుకాలనీకి చెందిన ఏ.పుష్పావతి విజ్ఞప్తి చేశారు. ఐదు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తన ఇంటికి పట్టా మంజూరు చేయాలని తాడేపల్లికి చెందిన కొమ్మినేని సాంబశివరావు కోరారు. ఆయా విన్నపాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వినతులు ఇలా.....

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా, నారాకోడూరుకు చెందిన కోడూరు వినోద్‌కుమార్ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులంటూ చిత్తూరుజిల్లాలో పని చేసే పలువురు హోంగార్డులను అన్నమయ్య జిల్లాకు వెళ్లాలని గతంలో అధికారులు ఆదేశించారని సొంత జిల్లాలోనే విధులు నిర్వహించేలా తగిన ఉత్తర్వులిచ్చి న్యాయంచేయాలని హోంగార్డులు కోరారు. విజయనగరం జిల్లా కోనాడ జిల్లా పరిషత్‌పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, నైట్ వాచ్‌మెన్ సక్రమంగా విధులు నిర్వహించడంలేదని వారిని తొలగించాలని పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటి చైర్మన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు. టీడీపీ సానుభూతిపరులనే నెపంతో గత ప్రభుత్వంలో 14 మందిపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని విజయ నగరం జిల్లా వెల్దూరు గ్రామ సర్పంచ్ నాయన సత్యవతి కోరారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో ఏడేళ్లనుండి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయంలో పని చేసే సంక్షేమ, విద్యా సహాయకులను మాతృశాఖ అయిన సాంఘిక సంక్షేమశాఖలో విలీనం చేయడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వంశపారంపర్యంగా తనకు సంక్రమించిన 1.46 ఎకరాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు పాస్ బుక్ మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గురిజేపల్లికి చెందిన వీరారెడ్డి విజ్ఞప్తిచేశారు. నకిలీ పత్రాలతో వంశపార్యంపర్యంగా వచ్చిన తమ రెండెకరాల పొలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి జూలకంటి బుడే కబ్జా చేశాడని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మొక్కరాల నరసమ్మ కోరారు.

ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌లో వొకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారికి 11 కేవీఏ సబ్ స్టేషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కల్పించాలని సత్యసాయి జిల్లా నిద్రగట్టకు చెందిన ఎల్‌కే. ప్రశాంత్‌కుమార్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

సత్యసాయి వాటర్ సప్లై కార్మికులకు 6 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, కార్మికులకు జీతాలు ఇవ్వడంతోపాటు ప్రాజెక్టుకు పూర్వ వైభవంకోసం చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా సత్యసాయి వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.



సత్తెమ్మ అమ్మవారు, దుండగులు పగల గొట్టిన హుండీ

అటవీ ప్రాంతంలోని ఆలయంలో చోరీ

- నాలుగు హుండీలలో నగదు, ఆభరణాలు అపహరణ

అచ్చంపేట, ఆగస్టు 21 : మండలంలోని మాదిపాడు అటవీ ప్రాంతంలో వేంచేసి ఉన్న సత్తెమ్మ అమ్మవారి నాలుగు హుండీలు, అమ్మవారి మెడలోని బంగారు నగలను దొంగలు దోచుకు వెళ్లిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దేవస్థానంలోకి ప్రవేశించి, ముందుగా అక్కడి సీసీ కెమేరాలను ధ్వంసం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాలుగు హుండీలను, అమ్మవారి మెడలో విలువైన మంగళసూత్రాలతో పాటు తలపైవున్న వెండి కిరీటాలు, పలు ఆభరణాలు దోచుకెళ్లారు. సమీప ఎర్రవాగు ప్రాంతంలో హుండీలు పగల గొట్టి నగదును కొల్లగొట్టారు. బుధవారం యధావిధిగా ఆలయ పూజారి, సిబ్బంది పూజారి దేవస్థానం వద్దకువచ్చి తలుపులు తెరవగానే హుండీలు, అమ్మవారి మెడలోని మంగళసూత్రాలు లేక పోవటంతో స్థానిక ఏఎ్సఐకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేసి హుండీలను స్వాధీనం చేసున్నారు. ఆలయంలో ఇలాంటి ఘటన జరగటం ఇదే మొదటిసారి. ఆలయంలో చోరీకి గురైన సొత్తు మొత్తం సుమారు రూ.10 లక్షలకు పైగా ఉంటుందని భక్తులు తెలిపారు. దేవస్థానం వద్ద రాత్రి వాచ్‌మెన్ లేకపోవటంతోనే ఈ చోరీ జరిగిందని, ఇందుకు ఆలయ అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు మాట్లాడుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కేంద్రీయ విద్యాలయంలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

సెప్టెంబరులో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

- చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, ఆగస్టు 21 : ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవనాలను సెప్టెంబరులో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని ఇర్లపాడు గ్రామపరిధిలో నిర్మాణంలో వున్న కేంద్రీయ విద్యాలయ భవననిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పుల్లారావు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలనే నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయన్నారు. కేంద్రీయ విద్యాలయాలు ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు బోధనను అందిస్తున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గణపవరంలో తాత్కాలిక భవనాల్లో తరగతులను ప్రారంభించామన్నారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన జరిగే ఈ విద్యాలయంలో 49 తరగతి గదులను నిర్మించారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల కన్నా విద్యాబోధనలో కేంద్రీయ విద్యాలయం మొదటిస్థానంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫణీంద్ర, టీడీపీ నేతలు సత్యనారాయణ, గంగా శ్రీనివాసరావు, హనుమంతరావు, నాగేశ్వరరావు, జయ ప్రసాదు, నాగ పూర్ణచంద్రరావు, సురేష్, ఉపేంద్ర, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గురజాల అదనపు జిల్లా కోర్టు ఏపీపీ తొలగింపు

గుంటూరు(లీగల్), ఆగస్టు 21: గురజాల అదనపు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న బారెడ్డి నాగిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పలు కేసుల్లో నాగిరెడ్డి ఉద్దేశపూర్వకంగా కోర్టులో దాఖలైన కొన్ని పిటీషన్‌ల గురించి పోలీసులకు సమాచారం అందించలేదని, కోర్టుకు నిజాలు చెప్పకుండా దాచి నిందితులు కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందేందుకు సహకరించాడని, ఇందుకుగాను నాగిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగించి మరొకరిని నియమించాలని కోరుతూ పల్నాడు జిల్లా ఎస్పీ జూన్ 18న ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై దర్యాప్తు జరిపిన ప్రాసిక్యూషన్ విభాగం పల్నాడు జిల్లా ఎస్పీ చేసిన ఆరోపణలలో వాస్తవం ఉందని తేల్చింది. నాగిరెడ్డి ప్రాసిక్యూషన్ వ్యవస్థ పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించాడని, తన వ్యవహార శైలితో ప్రాసిక్యూషన్ వ్యవస్థనే ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి తీసుకువెళ్లాడని, అతన్ని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థనే సవాల్‌చేసే పరిస్థితి ఉత్పన్నం కావచ్చని పేర్కొంటూ రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శికి ప్రాసిక్యూషన్ డైరెక్టర్ జూలై 4న నివేదిక ఇచ్చారు. దీంతో నాగిరెడ్డిని ఏపీపీ పదవి నుండి తొలగిస్తూ రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల ధ్వంసం కేసులతో పాటు పలు కేసుల్లో నాగిరెడ్డి వైసీపీ వర్గీయులకు కొమ్ముకాస్తూ నిందితులుగా ఉన్న వారిని కేసుల నుంచి బెయిల్ పొందేందుకు తన వంతు సహకారం అందించాడని అతనిపై పలు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ హయాంలో నియమితులై ఆ పార్టీ వారికి కొమ్ము కాస్తూ కోర్టుల్లో వ్యవహరిస్తున్న మరికొంతమంది టెన్యూర్ ఏపీపీలతో పాటు రెగ్యులర్ ఏపీపీల వ్యవహార శైలిపై కూడా పోలీసు శాఖతో పాటు రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ కార్యాలయం దృష్టిసారించినట్లు తెలిసింది.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 21: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం బుధవారం నాటికి 589.20 అడుగులు ఉంది. ఇది 309.65 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,826 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 47,650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 47,650 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 26845 క్యూసెక్కులు

- టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో 1.0615 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 21: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 2 యూనిట్ల ద్వారా 1.0615 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కే.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. రెండు గేట్లను 1.5 మీటర్, ఒక గేట్‌ను మీటర్ మేర ఎత్తి 18419, టేల్‌రేస్ చానల్ ద్వారా 8426 మొత్తం 26845 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం 75.42 మీటర్లు ఉండగా, అది 7.025 టీఎంసీలకు సమానమని తెలిపారు.

బ్యారేజి దిగువకు 21,900 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 39వేల 544 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 21 వేల 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17వేల 644 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.



బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

రజకుల ఆర్థికాభ్యున్నతికి కృషి చేయండి

- సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

తాడేపల్లి, ఆగస్టు 21: ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించి ఆ నిధులను రజకుల ఆర్థిక అభ్యున్నతికి వినియోగించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొలనకొండలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవితను కలిసి రజక వృత్తిదారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇస్త్రీ చేస్తున్న రజక వృత్తిదారులకు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత కరెంటు వెంటనే మంజూరు చేయాలని, అలాగే పట్టణ కేంద్రాల్లో వృత్తిదారులకు అధునాతనమైన యంత్రాలతో మోడ్రన్ ధోబీ ఘాట్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి, వాటి అమలుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటి సభ్యులు బొజ్జ సుబ్బారావు, దావులూరి శ్రీనివాసరావు, నూతక్కి నాగేశ్వరరావు, మోర్తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వహణ భేష్

- ఫౌండేషన్‌లో పంపిణీ మానిటరింగ్ మెకానిజం బాగుంది
- గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



అక్షయ పాత్రను పరిశీలిస్తున్న కలెక్టరు నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, ఆగస్టు 21: అక్షయపాత్ర ఫౌండేషన్ వారి వంట తయారీ విధానం చాలా బాగుందని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద వున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌ను కలెక్టరు ఎస్.నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్న భోజనం తయారీ ఆధునిక పరికరాలను ఆమె పరిశీలించారు. భోజనం హైజెనిక్‌గా ఆహార పదార్థాలను తయారు చేసే విధానాన్ని ఆపరేషన్స్ మేనేజరు శ్రీహరి కలెక్టరు నాగలక్ష్మికి వివరించారు. అనంతరం కలెక్టరు విలేకరులతో మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్‌ద్వారా తెనాలి, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లోని 311 పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందించడంతో పాటు ఈ నెల 16వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లకు కూడా ఇక్కడినుంచి ఆహారం సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఒక లక్ష మందికి భోజనం తయారు చేయడానికి అవసరమైన అత్యాధునిక వంట సామగ్రి ఇక్కడ అందుబాటులో వుందన్నారు. తయారైన ఆహార పదార్థాలను సకాలంలో జాబితా ప్రకారం అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు మానిటరింగ్ మెకానిజం బాగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టరు పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనరు అలీమ్ బాషా, డీఎస్వో కోమలి పద్మ, మార్కెటింగ్ ఏడీ రాజాబాబు, మంగళగిరి తహసీల్దారు సుభానీ అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాటి దుర్ఘటన జరిగి నేటికి 25 ఏళ్లు..

- గోలివాగులో 10 మంది జల సమాధి



ఉధృతంగా ప్రవహిస్తున్న గోలి వాగు (ఫైల్)

రెంటచింతల,ఆగస్టు 21 : సరిగ్గా పాతికేళ్ల క్రితం ఇదే రోజు.. భారీ వర్షాలు కురుస్తున్నాయి. గృహంలోంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. గోలి వాగు మహోధృతంగా ప్రవహిస్తుంది. లోవెల్ చపా మీద నుంచి వాహనాలు వెళ్లడం అంతంత మాత్రమే. అయితే ఒకటి రెండు లారీలు వాగు దాటి ఆవలి ఒడ్డుకు చేరాయి. మాచర్లలో వివాహానికి హాజరయ్యేందుకు 10 మంది సుమో వాహనంలో గురజాలలో బయలుదేరి గోలి వాగు దగ్గరకు వచ్చారు. వాగు దాటే పరిస్థితి లేదు. అందులో ఓ పెద్దాయన ముందు వెళ్లిన లారీ వాళ్లను అడిగి మోకులు(తాళ్లు) తీసుకోండి.. సుమోకు కట్టి వెళ్దాం.. పెళ్లికి టైమౌతోందని ఉచిత సలహా ఇచ్చాడు.. డ్రైవర్ మణి మోకులు తెచ్చి సుమోకి కట్టి వాగు మీద నుంచి లాగిస్తున్నారు. కొంత దూరం వెళ్లగానే తాళ్లు తెగిపోయాయి. సుమో నీళ్లలో కొట్టుకుపోయింది. 10 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటనకు నేటికి 25 ఏళ్లు (2000 ఆగస్టు 22).

52,234 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 53,961 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 52,234 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 24,572 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7000	17500	334	8500	17000
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	9000	13000
273	9000	12500	273	–	–
341	8000	16500	341	8500	17000
4884	10500	11000	4884	9500	16500
సూపర్ 10	--	--	సూపర్ 10	10000	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18800	తేజ	8000	18500
బ్యాడిగి	8000	17000	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	8700	13500	దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



తుమ్మలచెరువు టోల్‌ప్లాజా పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

● పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

● తుమ్మల చెరువు టోల్ ప్లాజా, పరిసర ప్రాంతాల పరిశీలన

పిడుగురాళ్ల, ఆగస్టు 21: రాష్ట్ర రహదారిలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు పాటించాలని పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తుమ్మలచెరువు టోల్‌ప్లాజా, పరిసర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ప్రదేశాన్ని ఎస్పీ పరిశీలించారు. టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాలలో స్టాప్ బోర్డు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోపాటు ఇకముందు ప్రమాదాలు జరుగకుండా ఏయే చర్యలు చేపట్టాలో ఎస్పీ శ్రీనివాసరావు పిడుగురాళ్ల సీఐ వెంకటరావుకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రెండు రోజుల క్రితం తుమ్మలచెరువులో జరిగిన నల్లమేకల సైదమ్మ హత్యపై దర్యాప్తు జరుపుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సైదమ్మ హత్యపై అదే గ్రామానికి చెందిన కొందరు మహిళలు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సైదమ్మ హత్యపై పూర్తిస్థాయి దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిపి నిందితులను గుర్తించాలని పట్టణ సీఐ ఎస్ వెంకటరావును ఎస్పీ ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్పీ పోలీసు క్వార్టర్స్, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోండి

● తహసీల్దార్, కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు

దాచేపల్లి, ఆగస్టు 21: దాచేపల్లి నగర పంచాయతీ దక్షణగడ్డలోని సత్రం బజారులో ఉన్న విలువైన 40 సెంట్ల స్థలాన్ని వైసీపీ హాయంలో పలువురు ఆక్రమించుకొని, అమ్ముకొని సొమ్ముచేసుకున్నారని, ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఆ ప్రాతానికి చెందిన స్థాని కులు బుధవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ఆ స్థలం మహిళల బహిర్భూమి ఉపయోగపడుతుందని, దానిని అలాగే వదిలేయాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించి, అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజాయోపయోగార్థం వినియోగించాలని కోరుతూ దాచేపల్లి డిప్యూటీ తహసీల్దార్ రాజు, నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావులకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకు వెళతామన్నారు. కార్యక్రమంలో పగడాల భాస్కరరావు, కల్లూరి రాఘవేంద్రరావు, కొప్పుల శ్రీనివాసరావు, యరమాల బుజ్జి, కమతం వెంకటరావు, మాడిశెట్టి రామాంజనేయులు, బండ్ల ప్రభుదాను, హఫీజ్ పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో

నిందితుడు అరెస్టు

బెల్లంకొండ, ఆగస్టు 21 : అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన లోకేశ్ అనే యువకుడు బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ గురునాథబాబు విచారణ చేసి కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

అచ్చంపేటలో ఫాగింగ్

అచ్చంపేట, ఆగస్టు 21 : స్థానిక ఎస్సీ, ఎస్టీ, ముదిరాజుల కాలనీల్లో బుధవారం పంచాయతీ అధికారులు, సిబ్బంది దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్ చేశారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని ప్రజలకు సూచించారు.



డయేరియా నివారణకు సత్వర చర్యలు

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి రవి

● బాధిత గ్రామాల్లో వైద్య శిబిరాల సందర్శన

● పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ



కారంపూడి వైద్యశిబిరంలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కారంపూడి, ఆగస్టు 21: గ్రామాల్లో డయేరియా నివారణకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి రవి తెలిపారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో డయేరియా బాధితుల కోసం వైద్యాధికారులు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం డీఎంహెచ్‌వో రవి వైద్యశిబిరాన్ని సందర్శించారు. జీరో కేసులు నమోదయ్యే వరకు వైద్యశిబిరం నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం డయేరియాతో బాధపడుతూ స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను డీఎంహెచ్‌వో రవి పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డయేరియా కేసుల వివరాలను వైద్యాధికారిణి లక్ష్మీ మౌనికను అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారం గ్రామంలో ఒక డయేరియా కేసు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

గురజాల టౌన్ : గ్రామ, పట్టణాలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో రవి అన్నారు. బుధవారం జంగమహేశ్వరపురంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని వీధులను సందర్శించి జ్వర పీడితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు కాలువలను, తొట్టెలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పెదపాలెం గ్రామంలో డీఎంహెచ్‌వో పర్యటన

అచ్చంపేట: మండలంలోని పెదపాలెం గ్రామంలో బుధవారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ.రవి సందర్శించారు. గ్రామంలో లార్వా సర్వే, పారిశుధ్య పనులను పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు అందించారు. పెదపాలెంలో వైరల్ జ్వరాల తీవ్రత తగ్గేంత వరకు వైద్యశిబిరాన్ని కొనసాగించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ స్రవంతిని కోరారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్, వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, హర్ష వర్ధన్, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరావు, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.



గురజాలలో ఇంటింటి సర్వేలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో



ఆలయం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్

ఆలయంలో ఎమ్మెల్యే ప్రవీణ్ పూజలు

అచ్చంపేట, ఆగస్టు 21 : మండలంలోని ఓర్వకల్లులో వేంచేసి ఉన్న సత్తెనపల్లి తల్లి అమ్మవారి దేవస్థానం వద్ద ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ప్రత్యేక పూజలుచేశారు. అచ్చంపేటకు చెందిన టీడీపీ నేత రాయిడి వీరాంజనేయులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రవీణ్ దేవస్థానం అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ కూడా ఈకార్యక్రమానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మండల సమాగ్రాభివృద్ధే ధ్యేయం

రాజుపాలెం, ఆగస్టు21: రాజుపాలెం మండల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలని తహసీల్దార్ దుర్గేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం తహసీల్దార్ దుర్గేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందటంతో పాటు, ఆయాగ్రామాలూ అన్నివిధాలా అభివృద్ధి చెందేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కన్నాను సన్మానిస్తున్న బంగారం వ్యాపారులు

ఎమ్మెల్యే కన్నాకు సత్కారం

సత్తెనపల్లి, ఆగస్టు 21 : ది జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ సభ్యులు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలసి సన్మానించి జ్ఞాపికను అందించారు. వారిలో ఏలూరి రత్నాకర్ మురళీకృష్ణ, జవ్వాజి రామ్మోహనరావు, దేవరశెట్టి రవి కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథం, చందలూరి రంగారావు, దేసు సోమశేఖర్, భవిరిశెట్టి కిరణ్ కుమార్, దేవరశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కారంపూడి, ఆగస్టు 21: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని బుధవారం పట్టణంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కేశానుపల్లి కృష్ణబాబు, అలిశెట్టి బొజ్జయ్య, నాగేంద్రబాబు, సైదావలి, సుబ్బారావు, మామిడి ప్రతాప్, లక్ష్మయ్య, కామేపల్లి ఏడుకొండలు, హేమంత్ పాల్గొన్నారు.

విజయవాడకు ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

సత్తెనపల్లి, ఆగస్టు 21 : సత్తెనపల్లి, ఆగస్టు 21 : సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు నూతన బస్సు సర్వీసును బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రయాణీకులకు ఆర్టీసీ మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయకుమార్, పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సంధ్యారాణి, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌పై ఫిర్యాదుతో విచారణ

బెల్లంకొండ, ఆగస్టు21: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన రజినీ అనే ఆశా వర్కర్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మరికొంత మంది నేతలు రెండు రోజుల క్రితం డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ డాక్టర్ కోటేశ్వరరావు బుధవారం మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి వెళ్ళి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, టీడీపీ నేతలు పలువురు ఆశ వర్కర్లు సక్రమంగా విధులు నిర్వహించటం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. అనంతరం లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని డాక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. ఫిర్యాదు ఇచ్చినవారిలో హనుమంతరావు, ఏసు, దానయ్య, ఏసుపాదం, అక్కల పెద్దిరెడ్డి, ఘంటసాల నాగయ్య తదితరలు ఉన్నారు.

రేపు ఉపాధిహామీ గ్రామ సభలు

కారంపూడి, ఆగస్టు 21: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈనెల శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. ఉపాధిహామీ వేతన కూలీల హక్కులు, అర్హతలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే అభివృద్ధి పనుల జాబితాను గ్రామసభలో చదివి వినిపిస్తామన్నారు. నూతన పనులకు ప్రతిపాదనలు, సామాజిక తనిఖీ ప్రాముఖ్యతను వివరిస్తామని తెలిపారు.

నకరికల్లు: ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులను గుర్తించటానికి శుక్రవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఏడాది చేపట్టనున్న పనుల్లో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాముఖ్యం ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామ సభలకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, అందరూ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

క్రోసూరు, ఆగస్టు 21 : గాలి కుంటు వ్యాధి పట్ల పశు పోషకులు, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని క్రోసూరు పశు వైద్యాధికారి డాక్టర్ మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని పీసపాడు, నాగవరం, క్రోసూరు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 700 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువులకు సోకితే రైతులు సకాలంలో వైద్యులను సంప్రదించటంతో పాటు టీకాలు వేయిస్తే ఆ వ్యాధిని నివారించ వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పశువైద్య సహాయకులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు..

పిడుగురాళ్ల, ఆగస్టు 21: జూలకల్లు జడ్పీ హైస్కూల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ దొండేటి వెంకటేశ్వరరెడ్డి బుధవారం రూ.1లక్షా50 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం వెంకటేశ్వర రెడ్డికి విద్య నేర్పిన గురువులైన మంగిరెడ్డి, శ్రీరామమూర్తి పేరున విద్యార్థులకు అవార్డు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల స్థల దాత నంద్యాల ధనుంజయ రెడ్డి, హెచ్ఎం సుబ్బరామయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

రెంటచింతల,ఆగస్టు 21 : రెంటచింతల ఎంపీడీవోగా వై.మహాలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఎన్నికల నిమిత్తం ఫిబ్రవరి 1న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు వెళ్లారు. ఇప్పుడు తిరిగి వచ్చి మళ్లీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 23న గ్రామ సభలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని కోరారు. గ్రామ సభలు నిర్వహించకపోతే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏపీవో జయచంద్ర, కార్యదర్శి జీ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

● ఇంటింటి సర్వే నిర్వహించిన వైద్యాధికారులు

● ఉచితంగా మందులు పంపిణీ

పిడుగురాళ్ల, ఆగస్టు 21: జానపాడు శివారులో వున్న జగజ్జీవన్‌రావ్‌కాలనీలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. కాలనీలో పలువురు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వైద్యాధికారులతో మాట్లాడారు. జగ్జీవన్ రామ్ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించి డయేరియాను అదుపులోకి తీసుకురావలని, ఇంటింటి సర్వే నిర్వహించి అందరికీ వైద్యపరీక్షలు నిర్వహించాలని, ఉచితంగా మందులు అందించాలని ఎమ్మెల్యే యరపతినేని వైద్యాధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం జానపాడు గ్రామానికి చేరిన ముప్పాళ్ల సాంబశివరావు, వున్నం సురేష్, పీ.నరసింహారావు, రామదాసులు వైద్యాధికారులతో జగ్జీవన్ రామ్‌కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రమాదేవి అవసరమైన ప్రతి ఒక్కరికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. జగజ్జీవన్‌రావ్ కాలనీలో డయేరియాతో ఇబ్బంది పడుతున్నామని స్థానిక టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే ఆకాలనీలో వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఇందుకు గాను స్థానికులు ఎమ్మెల్యే యరపతినేనికి కృతజ్ఞతలు తెలిపారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రమాదేవి



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

చివరి భూముల వరకు సాగు నీరు ..

పెదకూరపాడు, ఆగస్టు 21 : ఎన్ఎస్ కెనాల్స్ కాలువల్లో పూడిక తీత పనులు త్వరిత గతిన చేపట్టి కాలువ చివరి భూముల రైతులకు సాగు నీరు అందిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గుంటూరులోని టీడీపీ పెదకూరపాడు నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ ముఖ్య నేతలతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులలో నీరు మెండుగా ఉన్నందున ఇరిగేషన్ కాలువలకు మైనర్ రిపేర్లు చేయించి చివరి భూముల వరకు సాగు నీరు అందించి రైతులను ఆదుకుంటామన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చి రైతులు సాగు చేసే పంటల పై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని వైసీపీ ప్రభుత్వంలో రైతుల కష్టాలను పట్టించు కోలేదన్నారు.

అనధికార లే అవుట్లకు నో రిజిస్ట్రేషన్

● నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు

దాచేపల్లి, ఆగస్టు 21: నగర పంచాయతీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు లే అవుట్‌లు వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారని, అటువంటి అనధకార లేఅవుట్లకు ప్రభుత్వ పరంగా ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేసేది లేదని, నిర్మాణ అనుమతులు ఇవ్వమని దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అదేవిధంగా ఆయా స్థల యజమానులు, డెవలపర్స్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు దాచేపల్లిలో 17 అనధికార లేఅవుట్‌లను గుర్తించామని, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ నారాయణరావు హెచ్చరించారు.

ఓటర్ల జాబితా సవరణ పై సర్వే

సత్తెనపల్లి, ఆగస్టు 21 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమానికి సర్వే జరుగుతుంది. బీఎల్‌వోలు సర్వే ప్రారంభించారు. ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్ళి పరిశీలన చేసి అర్హులు ఎవరైనా ఉంటే కొత్తగా ఓటరు నమోదు చేసుకొనే అవకాశం కల్పిస్తారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ అక్టోబరు 18 వరకు కొనసాగుతుంది. అలాగే జాబితాలో చేర్పులు, మార్పులతో పాటు అనర్హులు ఉంటే వారిని తొలగించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడా అర్హులైన వారు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. నవంబరు 28 వరకు ఓట్ల తొలగింపు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, ఆగస్టు 21: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీలకు నిధులు కేటాయించకుండా చేసి ఆ వ్యవస్థను నిర్వీర్యంచేస్తే కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంచాయతీల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో రూ. 1452 కోట్లు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రాష్ట్రానికి కేటాయించడం హర్షణీయమన్నారు. జగన్ పాలనలో ఎంపీలు, ఎమ్మెల్యేలు దాడులు, దౌర్జన్యాలు, అవినీతి భూదందాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వంలో నేతలు రాష్ట్రాభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. అహర్నిశలు మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాటుపడుతున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందని యాగంటి కొనియాడారు.

వీఆర్వో భాస్కర్‌పై ఫిర్యాదు

మాచర్లటౌన్, ఆగస్టు 21: వీఆర్వో భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని చింతలతండాకు చెందిన రమావత్ మంగి బుధవారం దళిత బహుజన సంక్షేమ సేవాసంఘం నేతలతో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఫిర్యాదుచేశారు. అందించారు. చింతల తండా వీఆర్వో భాస్కర్ తన ఒరిజినల్ డీకే పట్టాను ఆన్‌లైన్‌లో ఎక్కించి ఇస్తానని తీసుకొని తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రూ.10 వేలు లంచం డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. వీఆర్వో భాస్కర్‌పై చర్యలు తీసుకొని తన పట్టాను ఇప్పించాలని కోరింది. కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, మహిళా నాయకురాలు కడియం శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో క్రోసూరు క్రీడాకారిణుల ప్రతిభ

క్రోసూరు, ఆగస్టు 21 : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన జట్టులో క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారిణిలు ప్రతిభ చాటారని, వీరు ఉమ్మడిజిల్లా జట్టు తరుపున టోర్నమెంట్‌లో పాల్గొన్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ రజిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17నుంచి 19 వరకు శ్రీకాకుళంలో 11వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరుగగా ఉమ్మడిజిల్లా జట్టులో తమ పాఠ శాలకు చెందిన కే.దీవెన, ఏంజల్, కే.పూజిత, జీ.తనూజ ఉన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు వీరు ఎంపిక కాగలరన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారిని వ్యాయామ, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పలువురు అభినందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



జెండా ఊపి ఎయిమ్స్‌కు బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

మంగళగిరి ఎయిమ్స్‌కు ఆర్టీసీ బస్సు ప్రారంభం

వినుకొండ, ఆగస్టు 21: మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి వినుకొండ నుంచి నూతనంగా బస్సును ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన వినుకొండ- మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి బస్సును వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత, ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీలో మంచి సంస్కరణలు మొదలయ్యాయన్నారు. భవిష్యత్‌లో ఇంకా ఎన్నో నూతన బస్సులు తీసుకురావడం జరుగుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈరోజు ఎయిమ్స్ ఆస్పత్రి ఎంతో అండగా నిలబడిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే నాణ్యమైన వైద్యం అందించడంలో మంగళగిరి ఎయిమ్స్ పేద ప్రజలకు కొండంత అండగా నిలబడిందని అన్నారు. ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లాలంటే గతంలో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ఈరోజు వినుకొండ డీఎం మంగళగిరి ఎయిమ్స్‌కు ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిరోజు ఉదయం 6.30కు, మధ్యాహ్నం 1.15కి బస్సు వినుకొండ నుంచి బయలు దేరుతుందని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు, విద్యార్థులకు ఆర్టీసీ నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎం కోటేశ్వరరావు నాయక్‌కు సూచించారు.

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అయూబ్‌ఖాన్, పత్తి పూర్ణ, సౌదాగర్‌జానీ, చికెన్‌బాబు, మాదినేని అంజనేయులు, చిరంజీవి, బోడెపూడి గోవిదంరాజులు, వెంకటరెడ్డి, ఆర్టీసీ యూనియన్ నాయకులు సాంబు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

● ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషన్ ఇన్‌చార్జి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 21: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం రాష్ట్రంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషన్ ఇన్‌చార్జి కేఎంఏ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాయడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలోని 8వ తరగతి చదువుతూ కుటుంబ ఆదాయం రూ.3.50లక్షల లోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష డి సెంబరు 8న జరుగుతుందన్నారు. పరీక్ష రాయడానికి ఓసీ, బీసీ విద్యార్థులు రూ.వంద, ఎస్సీ, ఎస్టీలు రూ.50 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబరు 6వ తేదీ తుది గడువన్నారు. పరీక్ష రుసుం చెల్లించడానికి సెప్టెంబరు 10 తుది గడువన్నారు. పరీక్ష రుసుంను ఆన్‌లైన్ అప్లికేషన్‌లోని ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ. ఏపీ. జీవోవీ. ఇన్‌లో, లేదా పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఈ పంట నమోదుతో ప్రభుత్వ పథకాల లబ్ధి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 21: పంటలు సాగుచేస్తున్న రైతులందరూ తమ పంటల వివరాలను తప్పనిసరిగా ఈ పంటలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి కోరారు. పట్టణంలోని మునిసిపల్ అతిథి గృహంలో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులతో ఈ పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ మురళి మాట్లాడుతూ జిల్లాలో పంటలను సాగుచేస్తున్న రైతులందరూ ఈ పంటను నమోదు చేసుకోవడం ద్వారా ప్రకృతి విపత్తులు సంభవించినపుడు రైతులకు పంట నష్టపరిహారం అందాలన్నా, ప్రభుత్వం నుంచి ఇతర పథకాల లబ్ధి పొందాలన్నా తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. గ్రామస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమలశాఖ, మైక్రో ఇరిగేషన్ అధికారులందరూ సమన్వయంతో ఈ పంట నమోదుపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు.



రాష్ట్ర మహిళ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా

ప్రభుత్వ సాయం కోసం మంత్రికి క్రీడాకారుడు వినతి

వినుకొండ, ఆగస్టు 21: ప్రభుత్వ సాయం అందించాలని వినుకొండకు చెందిన జాతీయ యువ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా రాష్ట్ర మహిళ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని బుధవారం కలిసి విన్నవించారు. వినుకొండ డిగ్రీ కళాశాల రికార్డు అసిస్టెంట్ సయ్యద్ కరిముల్లా ప్రోద్బలంతో సీఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మహిళ శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని బుధవారం కలిసి క్రీడాపోటీల్లో శిక్షణ పొందేందుకు ఆర్థికసాయం చేయాలని వినతిపత్రం అందచేశారు. రానున్న రోజుల్లో ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొని దేశానికి పేరు తెస్తాననన్నారు. అబ్దుల్లా ఇంటర్మీడియట్ నుంచి రాష్ట్రస్థాయి పరుగు పందాలలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించిన జాతీయ క్రీడాకారుడు. అబ్దుల్లా తండ్రి ఓ సామాన్య పండ్ల వ్యాపారి. తండ్రికి చేదోడుగా ఉంటూ డిగ్రీ పూర్తిచేశాడు. జాతీయ స్థాయిలో జరిగే మారథాన్ పరుగుపందెం పోటీల్లో పాల్గొనేందుకు భూటాన్, నేపాల్ తదితర దేశాల్లో జరిగే పోటీలలో పాల్గొన్నారు. భవిష్యత్‌లో జరగనున్న లండన్, యూఎస్ఏ, యూఏఈ ఒలింపిక్స్ పోటీలలో పాల్గొనేందుకు తోడ్పాటునందించాలని వినతిపత్రంలో పేర్కొన్నాడు.

ఘనంగా శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



తంగినీడుపాలెంలో శ్రీలక్ష్మి అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్థులు

బొల్లాపల్లి, ఆగస్టు 21: మండలంలోని తంగినీడుపాలెంలో బుదవారం శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం కోలాట ప్రదర్శన, రెండువేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం గ్రామస్థుల సహకారంతో ఏర్పాటుచేశారు. అమ్మవారి తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రొంపిచర్ల తహసీల్దార్‌గా నిర్మల

రొంపిచర్ల, ఆగస్టు 21: రొంపిచర్ల మండల తహసీల్దార్‌గా నిర్మల పదవీ బాధ్యతలను చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా బెల్లంకొండ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ తహసీల్దార్‌గా బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఆమెను కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కట్టను తవ్వి చెరువు ఏర్పాటు





● ప్రమాదకరంగా చెరువు కట్ట
● ఇష్టారాజ్యంగా జలజీవన్ మిషన్ పనులు
● ముంపుపై ఆందోళనలో గ్రామస్థులు

చెరువు కట్టను తవ్విన ప్రాంతం, వర్షాలతో కోతకు గురైన కట్ట

నాదెండ్ల, ఆగస్టు 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులే కాదు, కాంట్రాక్టర్లు కూడా ఇష్టానుసారంగా వ్యవహరించారు. వైసీపీ నాయకుల అండతో అధికారులు వద్దన్నా వినకుండా దశాబ్దాల కాలంగా ఉన్న చెరువుకట్టను తవ్వి ఆ మట్టిని మరో చెరువు ఏర్పాటుకు ఉపయోగించారు. చెరువు కట్ట మట్టిని తవ్వటంతో ఎత్తుతగ్గి బలహీనపడిన కట్టతో ప్రమాదం పొంచి ఉందని తూబాడు గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూబాడు గ్రామ పరిధిలో సుమారు 32ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊర చెరువులో జలజీవన్ మిషన్ పథకం కింద తాగునీటి చెరువు ఏర్పాటుకు రూ.1.79కోట్ల నిధులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయి. 32ఎకరాల చెరువులో సుమారు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో తాగునీటి చెరువు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నాలుగు వైపులా 3.6 మీటర్ల ఎత్తుకు తగ్గకుండా చెరువుకట్ట ఏర్పాటు చేయాలని, లోపలి భాగంలో కట్టకు సిమెంట్ కాంక్రీట్ ప్యానల్‌తో పాటు తదితర పనులు చేయాలి. అంత వరకు బాగానే ఉంది.

ఎన్నికల హడావుడిలో...

ఊర చెరువుకు తూర్పు వైపున శబ్దాల కాలం నాటి సుమారు 15 అడుగుల ఎత్తయిన కిలో మీటరు పొడవులో చెరువు కట్ట ఉంది. గతంలో నీరు, చెట్టు కార్యక్రమం నిర్వహించినప్పుడల్లా ఆ కట్టను బలపరుస్తూ వచ్చారు. కొత్త చెరువు ఏర్పాటుకు కిలో మీటరులోపు మట్టి తరలిస్తే క్యూబిక్ మీటరుకు రూ.130 చెల్లించాలన్నది అంచనా. అంటే ఒక ట్రాక్టర్‌కు రూ.400 అన్నమాట. బలంగా ఉన్న చెరువు కట్టను తాకవద్దని అధికారులు చెప్పినా కాంట్రాక్టర్ వినలేదు. ఎన్నికల హడావుడిలో సుమారు మూడు వందల మీటర్ల పొడవులో ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తు ఉన్న చెరువు కట్టను తవ్వారు. ఆ మట్టిని కొత్త చెరువుకు కట్ట నిర్మాణంగా ఉపయోగించారు. ప్రస్తుతం తూర్పు వైపు ఉన్న చెరువు కట్ట మూడు లేదా నాలుగు అడుగుల ఎత్తుకు మించి లేదు.

పొంచి ఉన్న ముంపు ముప్పు

ఎత్తులేని చెరువు కట్టతో దిగువున ఉన్న పొలాలకు, గ్రామంలోని ముస్లిం కాలనీకి ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షం కురిస్తే ఆ చెరువుకు ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు అంతా వచ్చి చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బలహీనంగా ఉన్న ఎత్తులేని కట్ట తెగితే దిగువున ఉన్న సుమారు నాలుగు వందల ఎకరాల పొలంలో సాగవుతున్న పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన ఒక వర్షానికే కట్టకు గండ్లు పడ్డాయి. అలాగే ముస్లిం కాలనీకి కూడా ప్రమాదం పొంచి ఉందని కాలనీ వాసులు చెపుతున్నారు. గతంలో కూడా భారీవర్షాల వల్ల చెరువు కట్ట తెగి ముస్లిం కాలనీని వరదనీరు చుట్టుముట్టింది. ఇదే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చెరువు కట్టను పరిశీలించారు. కట్ట ఎత్తును పెంచి జరిగిన తప్పును సరి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

రిజర్వేషన్ల మూలాలను కదలించేందుకు బీజేపీ యత్నం

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్



నరసరావుపేట మున్సిపల్ పాఠశాల నుంచి విద్యార్థులను పంపించివేస్తున్న మాలమహానాడు, బీఎస్పీ నేతలు, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 21: సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఇచ్చిన తీర్పు దేశంలోనే అంబేద్కర్ వాదులు దళిత గిరిజన వర్గాల రిజర్వేషన్ల మూలాలను కదలించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ఆరోపించారు. బుధవారం భారత్ బంద్‌లో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరరావుపేటలో ఆర్టీసీ బస్‌లు నిలిపివేశారు. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల కనుసన్నలలో తీర్పులు జరగటం న్యాయస్థానాల మీద నమ్మకం కోల్పోయే లా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు న్యాయస్థానాలు దళిత గిరిజనులకు 2021 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు పెంచే ఆలోచన చేయాలే తప్ప అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల హక్కులను కాలరాయాలని చూస్తున్న ఏ ప్రభుత్వాలకైనా తగిన గుణపాఠం చెప్తామని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బూదాల బాబురావు, కూచిపూడి చంద్ర, ఎం.రవి, పుస్తేల జయరావు, డేవిడ్, గోదా బాల, బోరుగడ్డ అంబేద్కర్, తుళ్ళూరు శివయ్య, గురస్వామి, సేవా సామేలు, జొన్నలగడ్డ వెంకటరావు, కొండ్రు ఆనంద్, నన్నం రాము, నీలాంబ్రం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుకు వినతి పత్రం అందజేస్తున్న భారత్ బంద్‌లో పాల్గొన్న నాయకులు

ఈపూరులో ...

ఈపూరు, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన భారత్‌బంద్ కార్యక్రమం ఈపూరులో ప్రశాంతంగా జరిగింది. బంద్‌కు సహకరించాలని మాల మహానాడు ఆధ్వర్యంలో తహసీల్దారుకు, ఎంపీడీవో, పోలీసులకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మీసాల చిన్నప్రసాదు, డేవిడ్,కిషోర్, భాగ్యరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాలలు

వినుకొండ టౌన్, ఆగస్టు 21: దేశవ్యాప్తంగా మాల మహానాడు పిలుపు మేరకు వినుకొండలో మాల మహానాడు నాయకులు పెద్దఎత్తున రోడ్లపైకి చేరుకుని బుధవారం బంద్‌లో భాగంగా భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. అనంతరం కాలేజీలను, హైస్కూల్స్‌ను మూసివేయించారు. ఈ సందర్భంగా మాల మహానాడు అధ్యక్షుడు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సుప్రీం కోర్టు పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసమే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని, లేకుంటే సుప్రీంకోర్టు గతంలో తిరస్కరించిన బిల్లును, బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోడీ, కిషన్‌రెడ్డి దళితుల మీద అతి ప్రేమ చూపించడం నాటకమని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినుకొండ ఆర్టీసీ డిపో వద్ద నుంచి ర్యాలీ చేస్తున్న మాల మహానాడు నాయకులు

చిలకలూరిపేటలో భారత్ బంద్ విజయవంతం

చిలకలూరిపేట, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పట్టణంలో బుధవారం భారత్ బంద్‌ను నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే నాయకులు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకొని బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. బస్టాండ్ గేటు వద్ద కూర్చొని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాటాలు వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పోలీసులు ఆయా సంఘాల నాయకులతో చర్చలు జరిపిన అనంతరం ఉదయం 9గంటల నుంచి బస్సుల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ప్రైవేట్ విద్యా సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. నాయకులు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నరసరావుపేట సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాజీమంత్రి, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుకు వినతిపత్రం అందజేసి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు, బీఎస్పీ, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ సూరజ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్

నరసరావుపేట రూరల్, ఆగస్టు 21: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలందరూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాలో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకున్న యువతీ, యువకులకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు, అంతర్జాతీయ కార్మిక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా చేపడుతున్న, జనరేట్ యువర్ బిజినెస్ అనే ప్రోగ్రాం ద్వారా నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకున్న యువతీ, యువకులకు ఉచిత శిక్షణ కార్యక్రమంను స్థానిక వాగ్దేవి డిగ్రీ కాలేజ్ జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వాగ్దేవి డిగ్రీ కాలేజ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వ్యాపారం చేయడానికి చాలా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సంజీవ మాట్లాడుతూ వ్యాపారం చేయదలచుకున్న వారందరికీ కార్పొరేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కే సంజీవరావు, నాబార్డ్ డిప్యూటీ డైరెక్టర్ శరత్, కాలేజీ ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ కాలేజీ ప్రెసిడెంట్ రామకోటేశ్వరావు కాలేజీ సెక్రటరీ శ్రీనివాసరావు, రాజశేఖర్ ఐపీవో ఇండస్ట్రియల్ డిపార్టుమెంట్, ఐఎల్‌వో ట్రైనర్ వెంకటనారాయణ కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ నిట్‌ను సందర్శించిన పేట విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 21: ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం, చిలకలూరిపేట, ఒంగోలులోని జవహర్ నవోదయ పాఠశాలలకు చెందిన 50మంది విద్యార్థినులు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వర్క్ షాపులను పరిశీలించారు. యంత్రాల పనితీరు, వాటి ప్రాధాన్యంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్, నవోదయ విద్యాలయం అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, కే.మాధురి, యామిని, బీ.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 21: మినీ వ్యాన్‌ను రాంగ్‌రూటులో వచ్చిన లారీ ఢీ కొనడంతో వ్యాను డ్రైవర్ మృతి చెందాడు. పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన కోటిరెడ్డి (35) విశాఖపట్టణానికి లోడుతో వెళ్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెం బైపాస్‌లో కమ్మవారి కల్యాణమండపం సమీపంలో ఒక లారీ రాంగ్‌రూటులో మినీవ్యానుకు ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన కోటిరెడ్డిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

వినుకొండలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీఐకు వినతి

వినుకొండ, ఆగస్టు 21: వినుకొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినుకొండ సీపీఐ నాయకులు బుధవారం సీఐ శోభన్‌బాబును కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలో పెరిగిన ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వివిధ పల్లెల నుంచి వినుకొండకు వచ్చే బాటసారులు రోడ్డుపై తిరగాలంటే, తిరగలేని పరిస్థితి నెలకొని ఉందని, వ్యాపార సముదాయాల వద్ద వాహనాలు అడ్డంగా పెట్టడం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీఐని కలిసిన వారిలో పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, రాయవరం వందనం, కొప్పరపు మల్లికార్జున, ధూపాటి మార్కు, సోమవరపు కోటేసు, తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట డీఎస్పీగా కొమ్మనబోయిన



డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 21: నరసరావుపేట డీఎస్పీగా కొమ్మనబోయిన నాగేశ్వరరావును బదిలీచేస్తూ రాష్ట్ర డీజీపీ తిరుమలరావు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26మంది డీఎస్పీలను బదిలీచేస్తూ జారీచేసిన ఉత్తర్వుల్లో నాగేశ్వరరావును నరసరావుపేటకు బదిలీచేశారు. ఇప్పటివరకు వెయిటింగ్‌లో ఉన్న నాగేశ్వరరావు బదిలీపై పట్టణానికి వచ్చేశారు. గతంలో పూర్తికాలం నరసరావుపేట డీఎస్పీగా ఒక పర్యాయం సేవలందించారు. నరసరావుపేట సబ్ డివిజన్ శాంతిభద్రతల నిర్వహణపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

● అర్బన్ సీఐ రమేష్ హెచ్చరిక

చిలకలూరిపేట, ఆగస్టు 21: పట్టణంలో బుధవారం అర్బన్ సీఐ సీహెచ్ రమేష్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది మైనర్లు వాహనాలు నడపటం గమనించిన ఆయన వారిని పోలీసు స్టేషన్ వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కాగా నెంబరు ప్లేట్లు లేకుండా వాహనాలపై తిరగటం, సరైన పత్రాలు లేకుండా ద్విచక్ర వాహనాలు కొని నడపటంచేస్తే ఆ వాహనాలను స్వాధీనం చేసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది, కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు, తదితరులు

'హత్యాచార దోషులను ఉరితీయాలి'

వినుకొండ, ఆగస్టు 21: జూనియర్ డాక్టర్‌పై లైంగికంగా దాడిచేసి, హత్య చేసిన దోషులను వెంటనే ఉరితీయాలని ప్రజా చైతన్య వేదిక, ఏఐసీసీటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు ఉయ్ వాంట్ జస్టిస్ అనే నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీన కలకత్తాలో మెడికల్ కాలేజీ హాస్పటల్‌లో జరిగిన హత్యాచారం చేసిన వారిని ఉరితీయాలని, ఇలాంటి ఘనటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, ఘనటన జరిగిన వెంటనే కఠినమైన శిక్షలు అమలు చేయాలని, అప్పుడే స్త్రీలకు రక్షణ ఏర్పడుతుందన్నారు. వైద్యశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, సెక్యూరిటీని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హత్య కేసులో నిజాలు, నిర్భయంగా వెలుగులోకి రావాలని అప్పటిదాకా ఈ పోరాటాలు ఆగవని రాము కేంద్రాన్ని హెచ్చరించారు. దేశంలో పుట్టిన ప్రతి ఆడపిల్లను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వాలు కళ్లు తెరిచి ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని కోరారు. సంఘీభావ ర్యాలీకి తిరుమల, బాలాజీ, మాధవ్ హాస్పిటల్స్‌తో పాటు, వినుకొండ ప్రభుత్వ వైద్యాధికారి అబ్దుల్ రజాక్, వైద్యశాల సిబ్బంది సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఫిరోజ్, రైతు సంఘం నాయకులు కె.వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, లింగాచారి, గోపీ, ప్రసాద్, రవి, శిరీష, కోమలి, శేఖర్, సునీత, సురేష్ పాల్గొన్నారు.



రైతులకు మందులను పంపిణీ చేస్తున్న పశుసంవర్థకశాఖ డీడీ డాక్టర్ రామారావు

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

● పశుసంవర్థకశాఖ డీడీ డాక్టర్ రామారావు

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), ఆగస్టు 21: సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధుల నుంచి సంరక్షించుకునేందుకు సకాలంలో టీకాలు వేయించాలని పశుసంర్థకశాఖ నరసరావుపేట డీడీ డాక్టర్ రామారావు అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీడీ పశువులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో గాలి కుంటు, గొంతువాపు వంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. సరైన ఎదుగుదల ఉన్నప్పటికీ సకాలంలో పశువు ఎదకు రానట్లయితే పరీక్షించి సకాలంలో వైద్యం అందించాలన్నారు. అలాగే గాలి కుంటు, గొంతువాపు వంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. పశుసంవర్దకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ మాట్లాడుతూ పుట్టిన వెంటనే దూడలకు ముర్రుపాలు తాగించాలన్నారు. అలాగే పుట్టిన ఏడు రోజులకు నట్టల నివారణ మందులు అందించడం ద్వారా దూడల మరణాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో నరసరావుపే, చిలకలూరిపేటకు చెందిన ఏడిలు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రోజర్‌బిన్ని, పశువైద్యాధికారులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ దీప్తి, పశుపోషకులు పాల్గొన్నారు.